క్లుప్తంగా

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి కె శోభా రాణి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుంకుమ పూజలు



కుంకుమపూజలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: నేరెళ్లకోనేరు కాలనీలో వెలసిన శ్రీ సిరి వినాయక ఆలయ 22వ వార్షికోత్సవం బుధవారం నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా శనివారం ఆలయ ఆవరణలో భక్తులు ఆలయ అర్చకుడు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిని విశేషంగా అలంకరించి, పూజలు చేపట్టారు. సాయంత్రం ఆలయం వద్ద దీపారాధన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దీపారాధన చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కార్యవర్గ సభ్యులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప అంబలం పూజ



పడిపూజలో పాల్గొన్న అయ్యప్పలు



అల్లిపురం: నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవాలయం వద్ద శనివారం సాయంత్రం అయ్యప్పస్వామి అంబలం పూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పలు పడిపూజను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. పదునెట్టాంబడి ఏర్పాటు చేసి విశేషంగా హారతి పూజలు చేస్తూ అయ్యప్ప పాటలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. శరణమయ్యప్ప అంటూ చిన్నా పెద్ద స్వాములు పాడిన గీతాలు భక్తులను అలరించాయి. అనంతరం అయ్యప్పలకు కైంకర్యం అందజేశారు.

అయ్యప్పలకు అన్నసమారాధన



అయ్యప్పలకు అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ భీశెట్టి వసంత లక్ష్మీ తదితరులు

అల్లిపురం: జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయ్యప్పలకు శనివారం బంగారుమెట్టలో అన్నస మారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీకే ఫౌండేషన్ చైర్మన్ భీశెట్టి గోపి కృష్ణ, 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంత లక్ష్మీలు పాల్గొని అయ్యప్పల సేవలో తరించారు. ప్రతి ఏడాది అయ్యప్పలకు అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బంగారు మెట్టతో పాటు వేంకటేశ్వరమెట్ట,నీలమ్మవేప చెట్టు తదితర ప్రాంతాల నుంచి అయ్యప్పలు పాల్గొని భిక్ష స్వీకరించారు.

వంటింట్లో నూనె మంట



వంటలో రుచి కావాలంటే నూనె ఉండాల్సిందే. ఇప్పుడా నూనె ధరల మంటతో సలసల కాగుతోంది. ఇప్పటికే నిత్యావసర ధరలు మండిపోతుండగా నూనె ధరలు అమాంతం పెరగడంతో సామాన్యుడి బడ్జెట్ గాడి తప్పింది. కూరగాయలు రేట్లు కూడా దాదాపు రెట్టింపు కావటంతో సామాన్యుడు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

- ఆందోళన వ్యక్తం చేస్తున్న సామాన్యులు
- గాడి తప్పిన వంటింటి బడ్జెట్



స్ప్రింగ్‌రోడ్డులో ఓ హోల్‌సేల్ షాపు



షాపులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఆయిల్ ప్యాకెట్లు

అల్లిపురం: నగరంలో ముఖ్యంగా వంట నూనెల హోల్ సేల్ దుఖాణాలు ఎక్కువగా దక్షిణ నియోజకవర్గంలోనే ఉన్నాయి. మొదటి నుంచి హోల్ సేల్‌తో పాటు సూపర్ స్టాకిస్టులు ఉన్నారు. ఈ ప్రాంతం నుంచి విశాఖ నగరంతో పాటు జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వ్యాపారులు హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తుంటారు. సుమారు వెయ్యి టన్నుల వరకు నెలకు నూనె వినియోగం ఉంటుంది. శుభకార్యాలు, పండగల సమయంలో అది మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం శుద్ధి చేసిన పామాయిల్ ధరలు ఏకంగా 37 శాతం వరకు పెరిగి సామాన్యుల వంటింటి బడ్జెట్‌ను అమాంతంగా పెంచేసింది. దీంతో బయట రెస్టారెంట్లు, హోటల్స్, స్వీట్ షాప్స్ వారు తమ మోనూలో ధరలు పెంచక తప్పని పరిస్థితి. గత సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం పామ్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ వంటి నూనెలపై దిగుమతి సుంకాన్ని పెంచింది. దీంతో పరోక్షంగా వంట నూనెలు ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా సోయాబీన్, క్రూడ్ పామ్, సన్‌ఫ్లవర్ నూనెలపై దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం 5.5 శాతం నుంచి ఒక్కసారిగా 27.5 శాతానికి పెంచింది. గత సెప్టెంబర్‌లోనే ఇది అమల్లోకి రావటంతో క్రమేణా ధరలు పెరుగుతూ వస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వం మళ్లీ దిగుమతి సుంకం తగ్గిస్తేనే ఆయిల్ ధరలు దిగొచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ధరలు పెరుగుదల ఇలా..

మూడు నెలల క్రితం ధర	ప్రస్తుత ధర
పామాయిల్ 15 లీటర్ల డబ్బా : రూ. 1,750	రూ.2,250
సన్‌ఫ్లవర్ 15 లీటర్ల డబ్బా : రూ.1950	రూ.2,400
పామాయిల్ లీటర్ : రూ.110	రూ.126
సన్‌ఫ్లవర్ : 123	147

నూనెల ధరలు తగ్గించాలి



మాది సామాన్య మధ్య తరగతి కుటుంబం. ఇప్పటికే నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరిగాయి. వంట నూనెల ధరలు కూడా పెరగటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వాలు ధరలు తగ్గించాలి. నెలకు 4 లీటర్ల వరకు నూనె వాడేవాళ్లం. ప్రస్తుతం రెండు లీటర్లతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. ధరలు పెరిగినంతగా ఆదాయం పెరగటం లేదు. – ఎం.సుబ్బలక్ష్మి, గృహిణి

చర్యలు తీసుకోవాలి



ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగాయి. దీనికి తోడు వంట నూనెలు ధరలు పెరగటంతో మాలాంటి మధ్య తరగతి ప్రజలకు బతకటమే కష్టంగా ఉంది. గతంలోలా పిండి వంటలు చేసుకోవటం తగ్గించేశాం. రెండు నెలలుగా నూనె ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. – భీమరశెట్టి అప్పారావు, బంగారుమెట్ట

కేంద్ర ప్రభుత్వం సుంకం తగ్గించాలి



కేంద్ర ప్రభుత్వం ఎడిబిల్ ఆయల్స్ పై కేంద్ర ప్రభుత్వం సుంకం పెంచటంతో ధరలు గత సెప్టెంబర్ నుంచి పెరుగుతూ వస్తున్నాయి. ఒక పక్క ధరలు పెరుగుదల, మరో పక్క డీ మార్టు వంటి మాల్స్ వల్ల వినియోగదారులు షాపులకు రావడమే కష్టంగా మారింది. దీంతో గతంలో రూ.12 కోట్లు మేర జరిగే నూనె వ్యాపారం రూ.10 కోట్లకు పడిపోయింది. – వూసి సునీల్‌కుమార్, కామధేను కిరాణా మర్చంట్

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..



దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 49వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముందుగా కళాశాల వ్యవస్థాపకుడు సింగవరపు సూర్యారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ ఈ ఏడాది కళాశాల స్వయం ప్రతిపత్తి పొందడం సంతోషకరమన్నారు. వచ్చే ఏడాదిలో కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకోనుందని చెప్పారు. కళాశాల స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి.. కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా పి.సాయితరణి, వైస్ ప్రెసిడెంట్‌గా ఈవీఎస్ త్రివేణి ఎన్నికైనట్టు ప్రకటించారు. గత విద్యా సంవత్సరంలో అకడమిక్, క్రీడలు, సామాజిక సేవా రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.సంతోషి అనూష పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగాయి. విద్యార్థినులతో కలిసి అధ్యాపకులు సందడి చేశారు.



సందడే సందడి





ట్రెండీగా...



శారీగమలు : చీరలతో కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపకులు

వసతిగృహానికి బిచ్చగాళ్లు



నిరాశ్రయులతో ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార : భిక్షాటనను ఉపాధిగా మలుచుకుని పలువురు వ్యక్తులు కుటుంబాలతో సహా విశాఖ వచ్చేస్తున్నారు. ఆ విధంగానే తాటిశెట్టి రాణి, తన భర్త తాటిశెట్టి గోపి, సోదరుడు శంకర్‌తో కలిసి విజయవాడ నుంచి విశాఖ వచ్చేశారు. రోడ్ల మీద కోతులను ఆడిస్తూ, భిక్షాటన చేస్తూ వచ్చిన డబ్బులతో తప్ప తాగి రైల్వే స్టేషన్‌ను అడ్డాగా మార్చుకున్నారు. ఏయూటీడీ సిబ్బంది నిర్వహించిన రెస్క్యూలో రాణిని పట్టుకుని ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్సులోని జీవీఎంసీ-ఏయూటీడీ షెల్టర్‌కి శనివారం తరలించారు. తర్వాత మద్యం సేవించి వచ్చిన గోపి, శంకర్‌లు గొడవ చేశారు. చివరకు విజయవాడ వెళ్లిపోతామని రాత పూర్వకంగా రాసి ఇవ్వడంతో వారిని మందలించి పంపించేశారు. ఈ కార్యక్రమంలో ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.

ఐఎన్‌సీ మజ్దూర్ సంఘ్ గౌరవాధ్యక్షుడిగా దేముడునాయుడు



ఐఎన్‌సీ మజ్దూర్ సంఘ్ నూతన కార్యవర్గం

దాబాగార్డెన్స్: ఇండియన్ నేవీ సివిలియన్ (ఐఎన్‌సీ) మజ్దూర్ సంఘ్ తూర్పు నావికాదళ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం శనివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. సమావేశం అనంతరం రెండేళ్ల కాలపరిమితికి నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా పైలా దేముడు నాయుడు, అధ్యక్షుడిగా పుట్టా విద్యాసాగర్, కార్యదర్శిగా రాజేష్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్య శ్రీనివాసరావుతో పాటు ఐదుగురు ఉపాధ్యక్షులతో పాటు మొత్తంగా 27 మంది కార్యవర్గ సభ్యులను సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. ఐఎన్‌సీఎంఎస్ అధ్యక్షుడు, బీఎంఎస్ కార్యదర్శి పి.విద్యాసాగర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాయుడు, రాష్ట్ర కోశాధికారి లాలం ప్రసాద్, బీఎంఎస్ జిల్లా ఇన్‌చార్జ్‌లు కార్యవర్గాన్ని ప్రకటించారు.

ప్రభుత్వ రంగంలోనే స్టీల్‌ప్లాంట్‌ను కొనసాగించాలి

సీతమ్మధార: విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలో కొనసాగించాలని పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కుమార్ మంగళం డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద రిలే దీక్షలో మద్దిలపాలెం జోన్ సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్ మంగళం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కంటే కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ప్రభుత్వ రంగంలో ప్లాంట్ కొనసాగుతుందా లేదా అనే అనుమానాలు ఎక్కువైయ్యాయన్నారు. ఈ నెల 29న ప్రధాని విశాఖ పర్యటనలో భాగంగా స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు జి.వి.యన్.చలపతి, కార్యదర్శి పి.వెంకటరావు, కె.కుమారి, అనపర్తి అప్పారావు, శివ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి సన్నిధిలో దేవదాయ శాఖ అదనపు కమిషనర్



దేవదాయ శాఖ అదనపు కమిషనర్‌కు ప్రసాదం అందజేస్తున్న ఈవో శోభారాణి

దాబాగార్డెన్స్: సిరులతల్లి కనకమహాలక్ష్మిని దేవదాయ శాఖ అదనపు కమిషనర్ టి చంద్ర కుమార్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. అనంతరం మార్గశిర మాస ఉత్సవాల ఏర్పాట్లపై కార్యనిర్వహణాధికారి కె శోభారాణితో చర్చించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె తిరుమలేశ్వరరావు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన..

మార్గశిర ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ ఇవో కె శోభారాణితో కలిసి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డీఎం ప్రశాంతి, అసిస్టెంట కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎన్ కాళిదాసు, ఇతర పోలీసులు అధికారులు పరిశీలించారు.

సంఘ సేవకుడు సత్తయ్యకు ఘన నివాళి

దాబాగార్డెన్స్: ప్రముఖ సంఘ సేవకుడు, స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తండ్రి సూరాడ సత్తయ్య వర్ధంతి కార్యక్రమం శనివారం పాతనగరం చాగంటి వారి వీధిలో నిర్వహించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని సత్తయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కొల్లి సింహాచలం, సూరాడ అప్పారావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సందడిగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం



తిరువీధి ఉత్సవంలో గౌరీ పరమేశ్వరులు



ఆకట్టుకున్న కాళీమాత వేషధారి



పులివేషధారుల విన్యాసాలు



స్కిట్ ప్రదర్శిస్తున్న జబర్దస్త్ కళాకారుల

అల్లిపురం: గత నెల 23వ తేదీ నుంచి వేంకటేశ్వర మెట్టపై శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం, గౌరీ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 77వ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు నేటితో ముగిశాయి. ముగింపు సందర్భంగా శనివారం అమ్మవారి తిరువీధి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి తిరువీధి ఉత్సవంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పులివేషాలు, తప్పిట గుళ్లు, బిందులు నృత్యం, కాళీమాత నృత్యం, కళాకారులు విన్యాసాల అబ్బురపరిచాయి. ఉత్సవాలు ముగింపు సందర్భంగా మధ్యాహ్నం మహా అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. జబర్దస్త్ కళాకారులు స్కిట్ విశేషంగా ఆకట్టుకుంది.

వేడుకగా సత్యసాయి జయంతి



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న జహీర్ అహ్మద్ తదితరులు

దాబాగార్డెన్స్: సత్యసాయిబాబా 99వ జయంతి పురస్కరించుకొని పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆశ్రమంలో శనివారం సత్యసాయిబాబా ట్రస్ట్ వేడుకగా నిర్వహించింది. కార్యక్రమంలో సంఘ సేవకుడు డాక్టర్ జహీర్ అహ్మద్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవాత్సవ్ పాల్గొని సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. పేదలు, వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పి.నారాయణ, నండూరి రామకృష్ణ, జగన్‌మోహన్, రాఘవేంద్ర, మిశ్రా, రవిశంకర్, కేవీ శర్మ, కపిల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. సత్యసాయి జయంతి పురస్కరించుకొని అక్కయ్యపాలెంలో గల ప్రియదర్శినీ వృద్ధాశ్రమంలో పట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆశ్రమంలో వృద్ధులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాదం అందజేశారు. పట్టా ఫౌండేషన్ సీనియర్ సభ్యురాలు బొడ్డేడ వెంకటలక్ష్మీ సత్యసాయి బాబా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

హైదరాబాద్ నిఫ్ట్‌లో అడ్మిషన్లు



మాట్లాడుతున్న అకడమిక్ కోఆర్డినేటర్ అన్నాజీ శర్మ

దాబాగార్డెన్స్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) జూలై 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభించనున్నట్టు ప్రకటించిందని ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్ అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం అన్నాజీ శర్మ తెలిపారు. శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లేస్‌మెంట్ అవకాశాలతో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, డాక్టోరల్ స్థాయి ప్రోగ్రామ్ కోర్సులు అందిస్తుందన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు ఫ్యాషన్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్, యాక్సెసరీ డిజైన్, నిట్‌వేర్ డిజైన్, లెదర్ డిజైన్, ఫ్యాషన్ కమ్యూనికేషన్, ఫ్యాషన్ టెక్నాలజీకి 10+2 చదివిన వారు అర్హులని, ఏదైనా విభాగంలో డిగ్రీ పూర్తి చేసిన వారు పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులకు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఈ నెల 29న ప్రారంభమవుతుందని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ జనవరి 6గా నిర్ణయించడమైందన్నారు.వివరాలకు www.nift.ac.in/ admission వెబ్‌సైట్ సందర్శించాలన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరం ప్రారంభించిన వన్‌టౌన్ సీఐ దేముడుబాబు

దాబాగార్డెన్స్: వైజాగ్ ఓల్డ్ సిటీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పాతనగరం లక్ష్మీటాకీస్ జంక్షన్ సమీపాన గల శెట్టిబలిజ సామాజిక భవనంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ దేముడుబాబు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టుల సామాజిక సేవా కార్యక్రమంలో తాను పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కొల్లి సింహాచలం మాట్లాడారు. అసోసియేషన్ అధ్యక్షుడు కీర్తన్, కార్యదర్శి అర్జున్ మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్ సహకారంలో ఏర్పాటు శిబిరంలో సుమారు 200 మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు.

కండీషన్లో ఉన్న బస్సులనే నడపాలి

దాబాగార్డెన్స్: కండీషన్‌లో ఉండే బస్సులను నడపాలని జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. అన్ని డిపోల గ్యారెజ్ అసిస్టెంట్ ఇంజినీర్లతో శనివారం ఆయన సమావేశమయ్యారు. మధురవాడ డిపోనకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు భీమిలి నుంచి శబరిమలైకు బయలుదేరిందని, ఆదివారం కూడా విశాఖ నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరనుందని ఆయన తెలిపారు. శబరిమలైకు వెళ్లేందుకు బస్సులు కావాల్సినవారు ఆయా డిపోల వద్ద గాని, ద్వారకాబస్టేషన్‌లో గానీ సంప్రదించవచ్చన్నారు. విశాఖ నుంచి పంచారామాల దర్శనానికి సూపర్ లగ్జరీ బస్సు చార్జీ ఒక్కొక్కరికీ రూ.2,150, అల్ట్రా డీలక్స్ చార్జీ ఒక్కొక్కరికీ రూ.2,100గా నిర్ణయించామన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణపై ప్రధాని ప్రకటన చేయాలి



ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నేతలు

సీతమ్మధార: ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 29న విశాఖ పర్యటన సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగుతుందని ప్రకటించాలని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఈనెల 26న నిర్వహించనున్న కార్మిక కర్షక ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖలో అన్ని వర్గాల ప్రజలు 1,400 రోజుల నుంచి ఐక్యంగా పోరాడుతున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రధాని ప్రకటించకుంటే.. ఆంధ్ర రాష్ట్రానికి, తెలుగు ప్రజలకు తీరని ద్రోహం చేసి నట్లేనన్నారు. నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మిక వర్గం, రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26వ తేదీన దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిషన్ మార్చా పిలుపు మేరకు భారీ ప్రదర్శన సభలు జరుగుతున్నాయన్నారు. విశాఖలో ఆ రోజు ఉదయం దొండపర్తి రైల్వే డీఆర్ఎం ఆఫీస్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు కార్మిక ప్రదర్శన సభ జరుగుతుందన్నారు. ఈనెల 24వ తేదీన ఉదయం 9 గంటలకు పాత గాజువాక నుంచి కార్మిక ప్రదర్శన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏపీఎఫ్‌టీయూ కార్యదర్శి దేవ, సీఐటీయూ నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, పి.వెంకట్ రెడ్డి, జి.అప్పలరాజు, పి.వెంకట్రావు, ఉరుకుటి రాజు, నూకరాజు, సింహాచలం, వి.వి.కష్టారావు అప్పారావు కుమారి పాల్గొన్నారు.

సిరి వినాయక ఆలయంలో దీపారాధన



అల్లిపురం: సిరి వినాయక దేవాలయం వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఆలయ ఆవరణలో భక్తులు భక్తి శ్రద్ధలతో దీపారాధన నిర్వహించారు. రంగుల ముగ్గులు వేసి 1008 దీపాలను ఏర్పాటు చేశారు. మహిళలు పాల్గొని దీపారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రమేష్, నీలబాబు తదితరులు పాల్గొన్నారు.